క్లుప్తంగా

వైద్య విద్యార్థినికి ఎమ్మెల్యే దొంతి భరోసా



ఖానాపురం : పేద విద్యార్థిని వైద్య విద్య అభ్యసించే దిశగా తోడ్పాటు అందిస్తానని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి హామీ ఇచ్చారు. మండలంలోని మంగళవారిపేటలోని గిరిజన సామాజికవర్గానికి చెందిన పేద విద్యార్థిని భూక్య సేవిక నీట్‌లో ప్రతిభ చాటి కోల్‌కత్తాలోని వైద్య కళాశాలలో సీటు సాధించింది. కాగా పేదరికం నేపథ్యంలో ఫీజులు చెల్లించేందుకు, ఖర్చు భరించేందుకు ఇబ్బంది పడుతుండగా స్థానిక నాయకులు ఆ కుటుంబ పరిస్థితిని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో సేవికను ఎమ్మెల్యే మాధవరెడ్డి పిలిపించుకుని మాట్లాడారు. నాలుగేళ్ల వైద్య విద్యాభ్యాసానికి అయ్యే ఖర్చులను తానే భరిస్తానంటూ భరోసా ఇచ్చారు. పేదలు ఉన్నత స్థాయికి ఎదిగా దిశగా అండగా ఉంటానని చెప్పారు.

సన్మానం



గీసుకొండ : జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ బి.సాంబశివరావును కాంట్రాక్ట్ డాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఏఎస్.భరత్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్యాధికారులు శనివారం శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ భరత్‌కుమార్ మాట్లాడారు. నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌ఎహెచ్‌ఎం) కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ అఖిల్, ఉపాధ్యక్షులు డాక్టర్ వనమాలు, డాక్టర్ నాగరాణి, రుచిత, మమత, షారోస్, పల్లవి, భవానీ తదితరులు పాల్గొన్నారు.

బీసీ కమిషన్ చైర్మన్‌కు..



రాయపర్తి : ఉమ్మడి వరంగల్ జిల్లా బీసీ కమిషన్ చైర్మన్, సభ్యుడు గోపిశెట్టి నిరంజన్‌ను మండల నాయకులు శనివారం కలిసి సత్కరించారు. కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన సందర్భంగా నిరంజన్‌తో మాట్లాడారు. కార్యక్రమంలో మధ్యప్రదేశ్ ఓబీసీ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ ఉల్లెంగుల యాదగిరి, టీపీసీసీ అనుబంధ ఐఎన్‌టీయూసీ కార్మిక విభాగం స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉల్లెంగుల యాదగిరి, కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు గబ్బెట బాబు, నాయకులు మడేల్ వీరన్న తదితరులు పాల్గొన్నారు.

చేయూత



రాయపర్తి : మండలంలోని జగన్నాథపల్లికి చెందిన కందుకూరి లచ్చమ్మ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతినిధులు శనివారం బియ్యం, వంటనూనె అందజేశారు. బాధిత కుటుంబ దుస్థితిని ఫౌండేషన్ ప్రతినిధి, రాష్ట్ర ఎస్సీ యూనియన్ ఉపాధ్యక్షుడు సురేందర్ నాయక్ దృష్టికి చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించారు.

మైలారం చర్చిలో..

మైలారంలోని చర్చిలో ఆరాధన ఉపవాస ప్రార్థన సందర్భంగా భక్తులకు భోజనం కోసం ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి 50 కేజీల బియ్యం, 15 కేజీల వంట నూనెతోపాటు రూ.6 వేల నగదు అందజేశారు. కార్యక్రమాల్లో ఫౌండేషన్ ప్రతినిధులు లేతాకుల మధూకర్‌రెడ్డి, యాదవరెడ్డి, యూసుఫ్, సంపత్, రవి, మచ్చ మారయ్య, కందుకూరి ఉప్పలయ్య, కందుకూరి మహేందర్, గూడెల్లి ప్రభాకర్, సంది దేవేందర్‌రెడ్డి, లేతాకుల రంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నియామకం

నల్లబెల్లి: జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్‌గా నల్లబెల్లి వైద్యాధికారి పోరిక రవీందర్ నాయక్‌ను శనివారం నియమించారు. ఈ మేరకు డీఎంహెచ్‌ఓ సాంబశివరావు నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ పోరిక రవీందర్ మాట్లాడుతూ అసంక్రమిత వ్యాధుల నిర్మూలనకు కృషి చేస్తామన్నారు.

నేటి వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలి

పర్వతగిరి : నేడు (ఆదివారం) హనుమకొండలోని కాకతీయ డిగ్రీ కళాశాలలో తలపెట్టిన ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ యూనియన్ వార్షిక మహోత్సవాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర కోఆర్డినేటర్ రాపాక రవీందర్ కోరారు. మండల కేంద్రంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహోత్సవానికి మంత్రి సీతక్క, ఎంపీ కావ్య, ఎమ్మెల్యే శ్రీహరి హాజరు కానున్నట్లు తెలిపారు.

ఎల్లుగ్గార్‌గుట్టపై మొరం దందా

- వన్యప్రాణుల ఆవాసానికి దెబ్బ
- వారసత్వ సంపద కనుమరుగవుతున్న దుస్థితి
- తవ్వకాలు నిలిపేయాలని స్థానికుల ఆందోళన



సంగెం : మండలంలోని ఎల్లుగ్గార్‌గుట్టపై యథేచ్ఛగా మొరం తరలిస్తున్న పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో వన్యప్రాణుల ఆవాసానికి దెబ్బ పడడమే కాకుండా వారసత్వ సంపద కనుమరుగవుతున్న దుస్థితి చోటు చేసుకుంటోంది. తవ్వకాలు నిలిపేయాని కొద్ది రోజులుగా మండలంలోని ఎల్లుగ్గార్‌స్టేషన్, బీకోజీనాయక్‌తండా, నర్సానగర్, తిమ్మాపూర్, ఎల్లుగ్గార్ రంగంపేట, తదితర గ్రామాల ప్రజల ఆందోళన మొదలైంది. ఎల్లుగ్గార్‌రంగంపేట రెవెన్యూ శివారులోని సర్వే నంబర్ 746లోని 3.2 హెక్టార్ల విస్తీర్ణం కలిగిన ఎల్లుగ్గార్‌గుట్టపై మొరం తవ్వకాల కోసం అనుమతి ఇవ్వవద్దని పరిసర గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది గుట్ట నుంచి మొరం తవ్వకాల కోసం నర్సానగర్ గ్రామ పంచాయతీ నుంచి అనుమతి కోరినప్పుడు స్థానికుల నుంచి వ్యతిరేకత రావడంతో తవ్వకాలు నిలిపేశారు. మళ్లీ మొరం తవ్వకాలు చేపట్టడంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. ఎల్లుగ్గార్ గుట్ట కారణంగానే రెండు గ్రామాలైన ఎల్లుగ్గార్‌రంగంపేట, ఎల్లుగ్గార్‌స్టేషన్ పేరు రావడంతోపాటు ఎల్లుగ్గార్ రైల్వేస్టేషన్‌కు పేరు వచ్చింది. ఎల్లుగ్గార్‌ను ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే ఒక ఐకాన్‌గా చెప్పవచ్చు. ఎల్లుగ్గార్ గుట్టపై కాకతీయుల కాలం నాటి కట్టడాలు, ఏడు కోనేరులు, లక్ష్మీనృసింహస్వామి, వేంకటేశ్వర స్వామి, అంజనేయస్వామి విగ్రహాలు ఉన్నాయి. అంతేకాకుండా ఆధ్యాత్మిక కేంద్రంగా, ప్రకృతి ప్రసాదించిన వారసత్వ సంపదగా ఉంది. దీన్నిపై దేవతా విగ్రహాలకు ఆలయాలు నిర్మించి అభివృద్ధి చేయక పోగా మొరం తవ్వకాలకు అనుమతి ఇవ్వడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సుమారు 153 ఎకరాల్లో విస్తరించిన ఎల్లుగ్గార్‌గుట్టపై పలు రకాల పండ్ల, పూల, నీడ ఇచ్చే వృక్షాలు వేల సంఖ్యలో ఉన్నాయి. గుట్టపై కోతులు, నక్కలు, తోడేళ్లు, ఏదులు, అడవి పందులు, నెమళ్లు, తదితర జీవులు అవాసం ఏర్పాటు చేసుకున్నాయి. గుట్టపైనున్న వారసత్వ సంపదను భావితరాలకు అందించాల్సిన బాధ్యతతో ప్రభుత్వం, అధికారులు మొరం, మట్టి తవ్వకాలకు అనుమతి ఇవ్వవద్దంటూ ప్రజలు పోరాటాలకు సిద్ధమవుతున్నారు. గుట్టపై మొరం తవ్వకాలు చేపట్టితే వేల సంఖ్యలో వృక్షాలు, మొక్కలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని, ప్రకృతి సంపద ధ్వంసమై జీవవైవిధ్యానికి తీరని నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుట్టపై తవ్వకాలను ఆపాలని మండలంలోని ఎల్లుగ్గార్‌స్టేషన్, నర్సానగర్, బీకోజీనాయక్ తండాలకు చెందిన పలువురు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని



తవ్వకాలు చేపడుతున్న పొక్లెయినర్

కలిసి విన్నవించినట్టు తెలిపారు. గుగులోత్ లక్ష్మణ్, జాటోత్ కోటి, గుగులోత్ రమేశ్, బానోత్ సుమన్, గుగులోత్ రమేశ్, వెంకటేశ్ తదితరులు మొరం తవ్వకాలు ఆపాలని శనివారం కోరగా మైనింగ్ శాఖ నుంచి అనుమతి ఉందని, టెక్స్‌టైల్ పార్కు అభివృద్ధిలో భాగంగా తవ్వకాలు కొనసాగిస్తున్నారని తెలిపారు. ఇకనైనా ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అత్యంత ప్రాముఖ్యత కలిగిన ఎల్లుగ్గార్‌గుట్టపై మొరం తవ్వకాలు చేపట్టకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



దుగ్గొండి : నాచినపల్లిలో నేలవాలిన వరిపంట

అకాల వర్షం.. అపార నష్టం..



వర్ధన్నపేట : తడిసిన ధాన్యాన్ని ఆరబోస్తున్న రైతులు



దుగ్గొండి : పీజీతండాలో ఒరిగిన మిర్చి మొక్కలు

వర్ధన్నపేట : శనివారం తెల్లవారుజామున సుమారు గంటసేపు కురిసిన వర్షానికి మండలంలో రైతులకు అపార నష్టం వాటిల్లింది. పలు గ్రామాలకు చెందిన రైతులు కల్లాల్లో, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులు పోసుకోగా వర్షానికి తడిసిపోయిన దుస్థితి నెలకొంది. దీంతో తీవ్ర ఆందోళనకు గురయ్యారు. తడిసిన ధాన్యాన్ని కల్లాల్లో ఆరబోసుకున్నారు.

దెబ్బతిన్న వరి, మిర్చి పంటలు

దుగ్గొండి : మండలంలోని పలు గ్రామాల్లో అకాల వర్షానికి వరి, మిర్చి పంటలు దెబ్బతిన్నాయి. మరో 8 రోజుల్లో కోయాల్సిన వరి పంట నేలపాలైన దుస్థితి నెలకొంది. గాలి, వాన కలిసి రావడంతో మిర్చి తోటల్లోని మొక్కలన్నీ వంగిపోయాయి. చేతికొచ్చే దశలో పంట నేలపాలు కావడంతో రైతన్నలు కన్నీటి పర్యంతం అవుతున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో కలిపి సుమారు వెయ్యి ఎకరాల్లో వరి, 300 ఎకరాల మిర్చి తోటలకు నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. దెబ్బతిన్న పంటలను వెంటనే సర్వే చేయించి పంట నష్టపరిహారం ఇవ్వాలని బాధిత రైతులు కోరుతున్నారు.

సమర్ధవంతంగా సర్వే చేయండి

నర్సంపేట రూరల్ : ఉపాధ్యాయులు కులగణన సర్వేను సమర్ధవంగా చేయాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కులగణన ఇంటింటి సర్వే కోసం నర్సంపేట మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న 47 మంది ఉపాధ్యాయులను ఎంపిక చేసినట్టు తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన మేరకు సర్వేలోని అన్ని అంశాలనూ క్షుణ్ణంగా నమోదు చేయాలని సూచించారు. సర్వే నేపథ్యంలో ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తున్నట్టు



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

చెప్పారు. ఉపాధ్యాయులు పకడ్బందీగా సర్వే చేసి ప్రభుత్వ లక్ష్యాన్ని సక్సెస్ చేయాలని ఆకాంక్షించారు. సమావేశంలో ఎంపీఓ రామ్మోహన్, ఎంఈఓ కొర్ర సారయ్య, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

కల్తీ విత్తన విక్రేతలపై చర్యలు తీసుకోవాలి



పంట నష్టాన్ని చూపుతున్న రైతులు

ఖానాపురం : కల్తీ విత్తనాలు విక్రయించిన వ్యాపారులపై చట్టరీత్యా చర్యలు తీసుకుని పంటలు నష్టపోయిన తమను ఆదుకోవాలని రైతులు వల్లెపు కుమారస్వామి, గట్ల సుదర్శన్, తదితరులు కోరారు. ఈ మేరకు బాధిత రైతులు నర్సంపేట ఏడీఏకు, ఎమ్మెల్యే మాధవరెడ్డికి శనివారం వినతి పత్రాలు అందజేసి మాట్లాడారు. నర్సంపేటలోని మయూరి సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్ షాపులో బయో సీడ్‌కు చెందిన 504 రకం విత్తనాలను కొనుగోలు చేశామని చెప్పారు. సుమారు 400 ఎకరాల్లో పంట సాగు చేయగా పూత దశ నుంచి నల్లగింజగా తయారై 80 శాతానికిపైగా పంట నష్టం వాటిల్లిందని తెలిపారు. పంటనష్టంపై మండల వ్యవసాయ అధికారికి ఫిర్యాదు చేయగా పరిశీలించారని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు స్పందించి బాధ్యులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతులు నర్సయ్య, బాలరాజు, మురళీ, తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు

మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలోని రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. కాలనీకి చెందిన ప్రజలు రాకపోకలు సాగించే సమయంలో ఇబ్బందులు పడుతున్నారు. పెరిగిన మొక్కలు విద్యుత్ స్థంబాలకు అల్లుకోవడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం సైతం ఏర్పడుతోందని కాలనీవాసులు వాపోయారు. అధికారులు స్పందించి పిచ్చి మొక్కలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. **- ఖానాపురం**

ప్రశ్నించాల్సిన అధికారి పేరు :
సట్ల సుప్రజ, పంచాయతీ కార్యదర్శి
ఫోన్‌నంబర్ : 8639178653

హుటాహుటిన విద్యుత్ పునరుద్ధరణ



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మారుస్తున్న సిబ్బంది

వర్ధన్నపేట : దీపావళి నోముల నేపథ్యంలో విద్యుత్ సరఫరా నిలిచిపోగా ఆ శాఖ అధికారులు హుటాహుటిన పనులు చేపట్టి పునరుద్ధరించారు. వివరాలిలా.. మండలంలోని కొత్తపల్లి గ్రామంలోని సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ శుక్రవారం రాత్రి కాలిపోగా బీసీ కాలనీకి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో కాలనీ అంతా చీకటిమయం అయ్యింది. దీపావళి నోములు ఉండడంతో కాలనీవాసులు విద్యుత్ శాఖ ఏఈ తరుణ్‌కు సమాచారం అందించి సమస్య తీవ్రతను వివరించారు. ఆయన వెంటనే స్పందించి విద్యుత్ సిబ్బందిని అప్రమత్తం చేసి శుక్రవారం రాత్రి కాలిపోయిన సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో కొత్తగా ఏర్పాటు చేయించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరింపజేశారు. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. ఏఈ తరుణ్‌కు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

మిషన్ భగీరథ గేట్‌వాల్వ్ కట్ చేసిన ఆకతాయిలు

చెన్నారావుపేట : మండలంలోని పాపయ్యపేటలో గుర్తు తెలియని వ్యక్తులు దుశ్చర్యకు పాల్పడ్డారు. గ్రామ పంచాయతీ కార్యాలయ సమీపంలోని ఓవర్ హెడ్ ట్యాంకు సమీపంలోని మిషన్ భగీరథ గేట్ వాల్వ్‌ను శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కట్ చేశారు. దీంతో మిషన్ భగీరథ నీళ్లు ఓవర్ ట్యాంకుకు ఎక్కకుండా నిలిచిపోయి గ్రామస్తులు తాగునీటి కోసం ఇబ్బంది పడాల్సిన దుస్థితి నెలకొంది. గేట్‌వాల్వ్‌కు వెంటనే మరమ్మతు చేసి దుశ్చర్యకు పాల్పడ్డ వ్యక్తులను గుర్తించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బిల్లులు చెల్లించాకే ఎన్నికలు నిర్వహించాలి

దుగ్గొండి : తాజా మాజీ సర్పంచ్‌లకు బాకీ ఉన్న అభివృద్ధి పనులు బిల్లులు చెల్లించాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని సర్పంచ్‌ల జేఏసీ జిల్లా నాయకుడు మోడెం విద్యాసాగర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వస్తే మొదట సర్పంచ్‌లకు పెండింగ్ బిల్లులు చెల్లిస్తామని హామీ ఇచ్చి తదనంతరం విస్మరించారని విమర్శించారు. తాజా మాజీ సర్పంచ్‌లు బిల్లులు రాక అప్పులు పెరిగిపోయి ఆత్మహత్య చేసుకుంటున్న దుస్థితి నెలకొందని ఆందోళన వెలిబుచ్చారు. గత ప్రభుత్వం సర్పంచ్‌లను మోసం చేసిందని ప్రచారం చేసి లబ్ధి పొందిన మంత్రి సీతక్క పెండింగ్ బిల్లుల విషయాన్ని మర్చిపోయారని వాపోయారు. పెండింగ్ బిల్లుల చెల్లింపు కోసం ఈనెల 4న హైదరాబాద్‌లో తలపెట్టిన సభకు బాధిత తాజా మాజీ సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు. సమావేశంలో నాయకులు ఓడేటి తిరుపతిరెడ్డి, సురేందర్‌రెడ్డి, మహేందర్, పైడయ్య, రవీందర్, ఉమేశ్‌రెడ్డి, అంకిల్ల రవి పాల్గొన్నారు.

శుభ్రతతో ఆరోగ్య పరిరక్షణ



వర్ధన్నపేట : వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటిస్తూ ఆరోగ్యాన్ని రక్షించుకోవచ్చని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటయ్య స్పష్టం చేశారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా కళాశాల ఆవరణలోని పిచ్చిమొక్కలను, చెత్తాచెదారాన్ని ఉపాధ్యాయుల పర్యవేక్షణలో విద్యార్థులు శనివారం తొలగించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడారు. విద్యార్థి దశలోనే అన్ని రంగాల్లో అవగాహన పెంచుకునేలా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటిస్తూ ఆరోగ్యవంతమైన జీవితం గడపాలని సూచించారు. విద్యార్థులు సమాజ చైతన్యానికి చొరవ చూపాలని చెప్పారు.

ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు హాస్యాస్పదం



వర్ధన్నపేట : మండలంలో గ్రామ సభలు నిర్వహించకుండానే ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం కమిటీలు ఏర్పాటు చేయడం హాస్యాస్పదంగా ఉందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కుందూరు మహేందర్‌రెడ్డి దుయ్యబట్టారు. మండల కేంద్రంలో విలేకరులతో శనివారం ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించబోయే ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం గ్రామ సభలు నిర్వహించకుండా కాంగ్రెస్ శ్రేణులకు కమిటీల్లో స్థానం కల్పిస్తున్నారని చెప్పారు. అన్ని పార్టీలను కలిపి గ్రామాల్లో కమిటీలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు ఇకనైనా వాస్తవాలను గుర్తించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం అండ లేకుండా ఏ ఒక్క పథకాన్ని కూడా సొంత నిధులతో అమలు చేసే సత్తా రాష్ట్ర ప్రభుత్వానికి లేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యేలు గ్రామాల్లో అన్ని పార్టీలను కలుపుకుని కమిటీలు వేసి లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేయాల్సిన అవసరం ఉందన్నారు.

నియోజకవర్గంలో 21 వేల సభ్యత్వాల నమోదు

నర్సంపేట : నర్సంపేట నియోజకవర్గంలో గత 40 రోజులుగా చేపట్టిన కార్యక్రమంలో బీజేపీకి 21 వేల సభ్యత్వాలు నమోదు అయ్యాయని ఆ పార్టీ నియోజకవర్గ నేత కంభంపాటి ప్రతాప్ తెలిపారు. పట్టణంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భారీగా సభ్యత్వ నమోదు కావడంలో చొరవ చూపిన మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, జిల్లా ముఖ్యనాయకులు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. దేశ, ధర్మ రక్షణ కోసం నిలబడే ఏకైక పార్టీగా చెప్పారు. ఆసక్తి కలిగిన ప్రజలు ఈనెల 10లోపు సభ్యత్వాన్ని నమోదు చేయించుకోవాలని కోరారు.

పరామర్శ

నెక్కొండ : మండలంలోని సాయిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సొన్నాయిల లక్ష్మయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని స్థానిక ఆదర్శ యూత్ నాయకులు శనివారం పరామర్శించారు. అనంతరం బాధిత కుటుంబానికి క్వింటా బియ్యం అందజేశారు. తొలుత లక్ష్మయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

నల్లబెల్లి : నల్లబెల్లికి చెందిన కోటగిరి మల్లయ్య ద్విచక్ర వాహనంపై బోల్లోనిపల్లికి వెళ్తుండగా కొండాయిల్‌పల్లికి చెందిన పెంతల రవి ద్విచక్ర వాహనంపై నల్లబెల్లి దిశగా వస్తుండగా రెండు వాహనాలు ఒకదాన్ని మరొకటి నల్లబెల్లి శివారులోని మద్యలవాగ బ్రిడ్జిపై శనివారం ఢీకొన్నాయి. మల్లయ్యకు తీవ్ర గాయాలు కావడంతో వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

డీసీ తండా సమీపంలో..

వర్ధన్నపేట : పట్టణ శివారులోని డీసీ తండా సమీపంలో లారీ సడెన్ బ్రేక్ వేయడంతో వెనుక వస్తున్న ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా.. వరంగల్‌లోని మండిబాజర్‌కు చెందిన హుసేన్ వరంగల్ నుంచి డీసీ తండాకు బైక్‌పై వస్తుండగా వరంగల్ నుంచి ఖమ్మం దిశగా ప్రయాణిస్తున్న లారీని ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయిన సడెన్ బ్రేక్ వేశాడు. దీంతో వెనుక ద్విచక్ర వాహనంపై వస్తున్న హుస్సేన్ బైక్ లారీకి వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో హుస్సేన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. 108 టెక్నీషియన్ నాగరాజు ప్రాథమిక అందించగా పైలెట్ రాజు ఎంజీఎం ఆస్పత్రికి తరలించాడు.

శ్రామిక రాజ్య స్థాపనే ధ్యేయం



జెండా ఎగరేస్తున్న సూరి, నాయకులు

నర్సంపేట : శ్రామిక రాజ్య స్థాపనే సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) ధ్యేయమని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి చిర్ర సూరి తెలిపారు. విప్లవోద్యమంలో అమరులైన వీరుల స్మారక వారోత్సవాలను పురస్కరించుకుని నర్సంపేట, ఖానాపురం మండలం అశోక్‌నగర్‌లో శనివారం ఎర్రజెండాలు ఎగరేశారు. ఈ సందర్భంగా సూరి మాట్లాడారు. దేశంలో 78 ఏళ్ల పార్లమెంటరీ పాలనలో ప్రభుత్వాలు ప్రజల సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ విధానాలతో దేశంలో పేదరికం, నిరుద్యోగం, కుల, మత, ఆర్థికక అసమానతలు నానాటికీ పెరిగిపోతున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. ప్రజలందరూ విప్లవోద్యమంలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా నాయకులు అడ్డూరి రాజు, ధారలింగన్న, భానోత్ జవహర్‌లాల్, గట్టికొప్పుల రవి, కత్తుల కొమురయ్య, మనోహరాచారి, వీరారెడ్డి, రాజశేఖర్, సుదర్శన్, పొన్నం కుమార్, సారంగం, తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే ప్రజాసమస్యల పరిష్కారం

పర్వతగిరి : పోరాటాలతోనే ప్రజాసమస్యలు పరిష్కారం అవుతాయని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అరూరి కుమార్ తేటతెల్లం చేశారు. మండల కేంద్రంలో మాదాసి యాకోబు అధ్యక్షతన శనివారం నిర్వహించిన పార్టీ గ్రామ కమిటీ నాల్గో మహాసభలకు కుమార్ అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తోందని తెలిపారు. రైతులు, కార్మికులకు నష్టం కలిగించేలా మోసపూరిత చట్టాలను తీసుకొచ్చి ప్రజాజీవనాన్ని దెబ్బతీస్తోందని చెప్పారు. కార్పొరేట్ శక్తులకు లబ్ధి చేకూర్చడంలో ముందుంటూ ప్రజలను విస్మరిస్తోందని విమర్శించారు. ఒకే దేశం, ఒకే ఎన్నికలే వంటి నినాదాలతో రాష్ట్రాల హక్కులకు భంగం వాటిల్లుతోందని చెప్పారు. అనంతరం గ్రామ శాఖకు నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా జిల్లా రమేశ్, సభ్యులుగా చిన్నపెల్లి కుమార్, మార్క కుమార్, మాదాసి యాకోబు, పాడేటి దయాకర్ ఎన్నికయ్యారు. అనంతరం కార్యదర్శి రమేశ్ మాట్లాడారు. పాలకుల తీరుపై ప్రజలకు అవగాహన కల్పించి చైతన్యవంతం చేసి పోరాటాలు నిర్మిస్తామని తెలిపారు.

క్రీడోత్సవాలు ప్రారంభం

నల్లబెల్లి : మండల కేంద్రంలోని క్రీడా ప్రాంగణంలో యువసేన స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో నల్లబెల్లికి చెందిన జూనియర్ అసిస్టెంట్ రావుల పెద్ద రవి జ్ఞాపకార్థం రెండు రోజులపాటు తలపెట్టిన ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయి షటిల్ క్రీడోత్సవాలు శనివారం రాత్రి ప్రాంభమయ్యాయి. రవి కుమారుడు కేశవ వర్మ ఈ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. తన తండ్రి జ్ఞాపకార్థం క్రీడాకారులను ప్రోత్సహించేలా భవిష్యత్‌లో సేవా కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో మౌనిక, రమేశ్, సుధాకర్, చాందిని, సాయి, శాలిని పాండవుల రాంబాబు, కోటగిరి నారాయణ, బత్తిని మహేశ్, మాసంపెల్లి అఖిల్, పిట్టల ప్రవీణ్, తడుక వినయ్, మేడిపల్లి రాజు, శివ, అరవింద్, వంశీ, హేమంత్, రావుల కేశవ వర్మ, పండుగ తరుణ్ పాల్గొన్నారు.

బీసీ‘ఏ’లోకి మార్చాలి

పర్వతగిరి : ముదిరాజ్ కులస్తులను బీసీ‘డీ’ నుంచి బీసీ‘ఏ’లోకి మార్చాలని జిల్లా అధ్యక్షుడు పొన్నం మొగిలి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మత్స్య సహకార సంఘం చీఫ్ ప్రమోటర్ చొప్పరి సోమయ్య, గోనెల పద్మ, డైరెక్టర్ కోటి, రాకేశ్, రాజు, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

డీసీఎంకు మంటలు

గీసుకొండ : మండంలోని కొనాయమాకుల వద్ద ఉత్తరప్రదేశ్ నుంచి బెంగుళూరు వెళ్తున్న డీసీఎంకు వెల్డింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. డీసీఎంతోపాటు అందులో ఉన్న పూజా సామగ్రి దహనమయ్యాయి.